ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 3 జూలై 2025



వానాకాలం సాగు అయోమయంగా మారింది. ముందస్తు మురిపించిన వరుణుడు.. ఆ తర్వాత కనుమరుగయ్యాడు. దీంతో సాగు పనులు సాగక రైతన్న దిగాలు చెందాడు. గత జూన్ నెల ఆసాంతం వానలు లేక పొలం పనులు సాగలేదు. ఆరేళ్లలో ఎప్పుడు లేనంతగా లోటు వర్షపాతం నమోదైంది. కొన్నిచోట్ల ముందస్తు వానలకు వేసిన పంటలు మాడు ముఖం పట్టాయి. రైతన్న చేసేదేమీ లేక మేఘాల వైపు చూస్తూ వానల కోసం ఎదురుచూశాడు. జూలై నెలలోనైనా వానలు కురువకపోతాయా అని గంపెడాశలు పెట్టుకున్నాడు. ఎట్టకేలకు ఈ నెల ఆరంభంలోనే వర్షాలు కురుస్తుండటంతో అన్నదాత మోములో ఆనందం వచ్చింది. వానలు ఇలాగే కొనసాగితే ఈ సీజన్ పంటలకు డోకా ఉండదని రైతులు పొలం బాట పట్టారు.

# ఆశల సాగు!

## జూలై పైనే అన్నదాత గంపెడాశలు

- ఆరంభంలో మురిపించిన మేఘాలు
- ఆ తర్వాత ముఖం చాటేసిన వరుణుడు
- జూన్ నెలలో భారీ లోటు వర్షపాతం
- ఆరేళ్లలో కనిష్ఠంగా కురిసిన వానలు
- ఉమ్మడి జిల్లాలో 30శాతం దాటని సాగు
- ప్రస్తుతం విస్తారంగా వర్షాలు
- ఊపిరి పీల్చుకుంటున్న రైతులు

**జూన్‌లో లోటు వర్షపాతం**

| జిల్లా | శాతం |
|---|---|
| రంగారెడ్డి | 25 |
| వికారాబాద్ | 44 |
| మేడ్చల్ | 75 |

**ఆయా జిల్లాల్లో పంటల సాగు**

| జిల్లా | శాతం |
|---|---|
| రంగారెడ్డి | 28 |
| వికారాబాద్ | 26 |
| మేడ్చల్ | 8 |

( ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ముందస్తు మురిపించిన రుతుపవనాలు ఆ తర్వాత కనుమరుగయ్యాయి. వానాకాలం ఆరంభమై నెలరోజులు దాటినా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. జూన్‌లో భారీ లోటు వర్షపాతం నమోదు కావడంతో కొన్ని ప్రాంతాల్లో పంటలసాగు ఆందోళన కలిగిస్తోంది. అనేక చోట్ల ఇంకా దుక్కులు కూడా పూర్తికాలేదు. రైతాంగం విత్తనాలు, ఎరువులు సిద్ధం చేసుకున్నప్పటికీ వర్షాలు లేకపోవడంతో వ్యవసాయ పనులు ముందుకు సాగలేదు. గడిచిన ఆరేళ్లతో పోలిస్తే గత జూన్ నెలలో కనిష్ఠంగా వర్షపాతం నమోదు కావడమే ఇందుకు కారణం. దీంతో రైతులంతా జూలై పైనే ఆశలు పెట్టుకున్నారు. జులై నెల ఆరుతడి పంటలు వేసుకునేందుకు అనుకూలమైన సమయం. ఈ నెలలో కురిసే వర్షాలపైనే ఆరుతడి పంటలు భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. గత జూన్ నెలలో మేడ్చల్ జిల్లాలో 75శాతం లోటు వర్షపాతం నమోదు కాగా, వికారాబాద్ జిల్లాలో 44శాతం, రంగారెడ్డి జిల్లాలో 25 శాతం సగటు కంటే తక్కువ వర్షం కురిసింది. జూన్ నెలలో పట్టుమని పది రోజులు కూడా వర్షాలు కురవలేదు. అనేక మండలాల్లో 25 రోజులకుపైగా అసలు వర్షపాతమే నమోదు కాలేదు. రంగారెడ్డి జిల్లాలో జూన్ మొదటి వారంలో మినహా మిగతా రోజుల్లో వర్షాలు పడలేదు. గండిపేటలో అత్యధికంగా 87శాతం లోటు వర్షపాతం నమోదైంది. అలాగే కొందుర్గు, కొత్తూరు, చేవెళ్ల, శంకర్‌పల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్, కందుకూరు, కడ్తాల్, కేశంపేట, అబ్దుల్లాపూర్, హయత్‌నగర్, సరూర్‌నగర్, బాలాపూర్ మండలాల్లో 35శాతానికి మించి

మిగతా 7వ పేజీలో...

**గత ఆరేళ్లలో రంగారెడ్డి జిల్లాలో జూన్ నెల వర్షపాతం (మి.మీ)**

| సంవత్సరం | జూన్‌లో వర్షపాతం |
|---|---|
| 2020 | 155 |
| 2021 | 90 |
| 2022 | 126 |
| 2023 | 82 |
| 2024 | 97 |
| 2025 | 73 |

## ముసురుకున్న వాన..!

**గడిచిన 24 గంటల్లో మంగళపల్లిలో 57.3 మిల్లీమీటర్లు నమోదు**

రంగారెడ్డి అర్బన్/యాచారం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాను ముసురు వాన వీడడం లేదు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఇప్పటికే చెలకల్లో మొలకెత్తిన మొక్కలు జీవం పోసుకున్నాయి. విత్తనాలు విత్తని రైతులు ఆ పనుల్లో బిజీ అయ్యారు. ముసురు వానకు అంతర్గత రోడ్లన్నీ బురదమయంగా మారాయి. శంకర్‌పల్లి మండలం ఫత్తేపూర్ బ్రిడ్జి కింద రోడ్డుపై

మిగతా 7వ పేజీలో...



తుక్కుగూడ నుంచి మహేశ్వరం వెళ్లే దారిలో కురుస్తున్న వర్షం



సభా స్థలిని పరిశీలిస్తున్న కేఎల్లార్

# నేడు మహేశ్వరానికి సీఎం రేవంత్ రాక

- మలబార్‌గోల్డ్ పరిశ్రమ ప్రారంభోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన కంపెనీ యాజమాన్యం

మహేశ్వరం, జూలై 2 ( ఆంధ్రజ్యోతి): మహేశ్వరంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ పరిశ్రమ ప్రారంభానికి సిద్ధమైంది. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా నేడు ప్రారంభించేందుకు పరిశ్రమ యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది. పరిశ్రమ ప్రారంభానికి సీఎం రానుండడంతో పోలీసులు ఎప్పటికప్పుడు సభాస్థలిని పరిశీలించడంతో పాటు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే తుక్కుగూడ లోని ఈ సిటీ, ఫ్యాబ్ సిటీలో అనేక రకాల పరిశ్రమలు ఉండడంతో వేలాది మంది నిరుద్యోగులకు ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. అదే తరహాలో మహేశ్వరం మండల కేంద్రం కేసీ తండా పరిసర ప్రాంతంలో నూతనంగా ఏర్పాటైన ఎలక్ట్రానిక్ సిటీలో వివిధ రకాల పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగానే మలబార్ గోల్డ్ పరిశ్రమను ప్రారంభించేందుకు పరిశ్రమ యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది. 4ఎకరాల విస్తీర్ణంలో రూ. 700 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలో 1500 నుంచి 2 వేల మందికి పైగానే ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి. కోల్‌కతా, బెంగళూరు, ముంబయి, కేరళ, జైపూర్, కాలికట్, కోయంబత్తూర్ వంటి ప్రాంతాల్లో ఎంతో ప్రసిద్ధిగాంచిన మలబార్ గోల్డ్ పరిశ్రమ ఇప్పుడు మహేశ్వరంలో ఏర్పాటు అవుతున్నందున ఇక్కడి నిరుద్యోగ యువతకు మంచి ఉపాది అవకాశాలు లభించనున్నాయి. కాగా ఈ పరిశ్రమలో నూటికి 20 శాతం మహిళలకు వారి విద్యార్హతలు, ఆభరణాల తయారీలో ప్రాధాన్యతను బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఇప్పటికే స్థానికంగా 670 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు వివిధ రకాల జ్యువెలరీ వస్తువుల తయారీపై శిక్షణ కూడా ఇచ్చారు. ఈ పరిశ్రమలో ఏడాదికి సుమారు పదిలక్షల టన్నుల బంగారు ఆభరణాలు, 1.5 లక్షల క్యారెట్ల వజ్రాభరణాలు తయారు చేయగల సామర్థ్యం ఈ పరిశ్రమకు ఉంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు, రాష్ట్రాల్లో మొత్తం 23 పరిశ్రమలు ఉండగా మహేశ్వరంలో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ సామర్థ్యమే ఎక్కువ అని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పరిశ్రమ

### ఏర్పాట్లను పర్యవేక్షించిన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మలబార్ గోల్డ్ పరిశ్రమను గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించేందుకు రానున్న నేపథ్యంలో బుధవారం పరిశ్రమ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సభా వేదికను కేఎల్లార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం పర్యటన పరిమితులతో కూడికున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి హడావిడి చేయకూడదన్నారు. దేప భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గంధపు చెక్కల పట్టివేత

- పోలీసుల అదుపులో ముగ్గురు.. పరారీలో ఇద్దరు

చేవెళ్ల, జూలై 2(ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న గంధపు చెక్కల వాహనాన్ని మాదాపూర్ ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు బుధవారం పట్టుకున్నారు. చేవెళ్ల ఏసీపీ కిషన్ విలేకరులతో మాట్లాడుతూ.. రూ.35 లక్షల విలువైన తెల్ల గంధం చెక్కలను తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు మండల పరిధిలోని బస్తేపూర్ గేట్ వద్ద పట్టుకున్నామన్నారు. మహారాష్ట్రలోని సంగ్లీ జిల్లా నుంచి నాగర్‌గూడలో ఉన్న ఆంధ్ర సుగంధ ద్రవ్యాల కంపెనీకి సుమారు 1000 కేజీల గంధం చెక్కలను తరలిస్తున్నారని తెలిపారు. అటవీశాఖ యాక్ట్ కింద ఐదుగురిపై కేసు నమోదు చేసి, ముగ్గురిని అదుపులోకి తీసుకొన్నామని, కంపెనీ ఓనర్, మేనేజర్ ఇద్దరూ పరారైనట్లు పేర్కొన్నారు. వాహనాన్ని గుర్తు పట్టకుండా తయారు చేసి గంధపు చెక్కలను తరలిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు అటవీశాఖ ఆఫీసర్ రవికుమార్, మాదాపూర్ ఎస్‌వోటీ సీఐ సంజయ్‌కుమార్, ఎస్ఐ సంతోష్‌రెడ్డి, చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, ఎస్ఐ శిరీష ఉన్నారు.



వాహనంలో తరలిస్తున్న గంధపు చెక్కలు

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో బ్యాడ్ వెదర్

- పలు విమాన సర్వీసుల రాకపోకలకు అంతరాయం

శంషాబాద్ రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వాతావరణం అనుకూలించకపోవడంతో పలు విమాన సర్వీసుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. జీఎంఆర్ అధికారులు తెలిపిన వివరాల మేరకు మంగళవారం సాయంత్రం నుంచి భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో బెంగళూర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో 6ఈ638 విమానాన్ని వైజాగ్‌కు, కోల్‌కతా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాల్సిన 6ఈ6526 విమానాన్ని బెంగళూర్‌కు, లక్నో నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాల్సిన విమానం బెంగళూర్, జైపూర్ నుంచి జీఎంఆర్ ఎయిర్‌పోర్టుకు రావాల్సిన 6ఈ471 విమానాన్ని బెంగళూర్‌కు, ముంబయి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాల్సిన 6ఈ5326 విమానాన్ని బెంగళూర్ ఎయిర్‌పోర్టుకు దారి మళ్లించారు. అదే విధంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మస్కట్‌కు వెళ్లాల్సిన ఏవో 735 విమానాన్ని రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. దారి మళ్లించిన విమానాలు తిరిగి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాయి.



## 5న పాలమూరు స్థితిగతులపై సదస్సు

షాద్‌నగర్ అర్బన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 5న ఉమ్మడి పాలమూరు జిల్లా స్థితిగతులపై సదస్సును నిర్వహిస్తామని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఎం.రాఘవాచారి ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ప్రొ.హరగోపాల్ హాజరవుతున్న సదస్సుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మేధావులు, సామాజిక సేవకులు, రైతు సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. ఉదయం 10గంటలకు ప్రారంభమై సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగే సదస్సులో జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై, జిల్లాకు రావాల్సిన కృష్ణానది జల వాటాపై, తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు.

# రోడ్డు విస్తరణ జరిగేనా?

## షాద్‌నగర్ - కిషన్‌నగర్ రోడ్డులో ప్రమాదకర మలుపులు.. తరచూ ప్రమాదాలు

షాద్‌నగర్‌రూరల్, జూలై2(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణం నుంచి కిషన్‌నగర్ వరకు రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడు జరుగుతాయా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. షాద్‌నగర్ నుంచి కిషన్‌నగర్ వరకు సింగిల్ రోడ్డుగా ఉండటం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలావరకు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. దాంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. పట్టణం నుంచి కిషన్‌నగర్ 4.6 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడి వరకు సింగిల్ రోడ్డు ఉండటమే కాకుండా రోడ్డుకు ఇరువైపులా కోసుకుపోయింది. ఎదురుగా వాహనం వస్తే సైడ్ ఇచ్చేందుకు రోడ్డు దిగి మళ్లీ రోడ్డు ఎక్కాలంటే ఇబ్బందులు పడుతున్నారు. కిషన్‌నగర్ శివారులోని సోలార్ ప్లాంట్ వద్ద ఉన్న

మిగతా 8వ పేజీలో...



సోలార్ ప్లాంట్ వద్ద ప్రమాదకరంగా మలుపు

### రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి



షాద్‌నగర్ నుంచి కిషన్‌నగర్ వరకు సింగిల్ రోడ్డు కావడం వల్ల చాలా ప్రమాదకరంగా మారింది. రాత్రివేళ ద్విచక్ర వాహనాలపై రావాలంటే భయమేస్తుంది. మలుపులు మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు విస్తరణ చేపట్టాలని ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకుపోతాం.

**కట్టా వెంకటేష్ గౌడ్, కిషన్‌నగర్**

### హామ్ కింద ప్రతిపాదనలు పంపించాం



షాద్‌నగర్ నుంచి కిషన్‌నగర్ వరకు డబుల్ రోడ్డు నిర్మించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. హామ్ పథకం కింద రూ.15 కోట్లు మంజూరు చేయాలని పంపించాం. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలుస్తారు.

**రాజశేఖర్, ఏఈ ఆర్‌అండ్ బీ, షాద్‌నగర్**



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఈ సురేశ్

## ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

- గృహ నిర్మాణ శాఖ డీఈ సురేశ్

తలకొండపల్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వేగవంతంగా నిర్మాణాలను చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ డీఈ సురేశ్ కోరారు. తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో బుధవారం ఆయన పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లు కట్టాలని సూచించారు. బేస్మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి బిల్లులు చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ రామచంద్రయ్య, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు హీనా, ఆరీఫ్, విష్ణు, పంచాయతీ సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.

## 15వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఏపీపీగా వేణుగోపాల్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): 15వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు ఇబ్రహీంపట్నం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వి.వేణుగోపాల్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. తన బాధ్యత మరింత పెరిగిందని, బాధితుల పక్షాన న్యాయ సేవలు అందించేందుకు కృషి చేస్తానని వేణుగోపాల్‌రెడ్డి అన్నారు.

## శిథిల భవనాలపై కలెక్టర్, డీఈవో ఆరా

యాచారం, జూలై 2(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలో పురాతన ప్రభుత్వ కార్యాలయాలు కూలడానికి సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన 'శిథిలావస్థలో సర్కారు భవనాలు' కథనానికి కలెక్టర్, డీఈవో స్పందించారు. శిథిల భవనాల గురించి ఎంఈవో పాండురంగారెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిరుపయోగంగా ఉన్న భవనాలను కూల్చడం మా పరిధిలో ఉండదని, అది పంచాయతీ అధికారులు చూసుకుంటారని ఆయన చెప్పారు.



## ఆలయాల్లో చోరీలు.. కటకటాలపాలు

- రూ.56.36లక్షల విలువ చేసే విగ్రహాలు, ఆభరణాలు స్వాధీనం
- సులభంగా డబ్బు సంపాదించాలని కూలీల నేరాల బాట
- వివరాలు వెల్లడించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు

8

## భరోసా లేని బతుకులు

- పరిశ్రమల్లో ప్రమాదాలు.. తనువు చాలిస్తున్న కార్మికులు
- పాశమైలారం, మేడ్చల్ ఘటనలతో ఉలిక్కిపాటు
- అధికారులకు పట్టని కార్మికుల రక్షణ

7



వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో, తహసీల్దార్లు

## 8 నుంచి బీఎల్‌వోలకు శిక్షణ

ఆమనగల్లు, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి బుధవారం కల్వకుర్తి ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్డీవో శ్రీను, ఆమనగల్లు తహసీల్దార్ లలిత, కడ్తాల తహసీల్దార్ ముంతాజ్, మాడ్గుల తహసీల్దార్ వినయ్ పాల్గొన్నారు. ఈ నెల 8 నుంచి 15 వరకు బీఎల్‌వోలకు శిక్షణ, కొత్త ఓటర్ల నమోదుపై చర్చించారు. డీటీలు రాఘవేందర్, అనిత, కిరణ్ కుమార్, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# భద్రత మరిచి.. వెలుగులు పంచి

● ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న మున్సిపల్ విద్యుత్ సిబ్బంది



రక్షణ పరికరాలు, వస్త్రాలు ధరించకుండానే కరెంటు పనులు చేస్తున్న ఎలక్ట్రికల్ సిబ్బంది

తాండూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): వారు వీధులకు విద్యుత్ వెలుగులు వచ్చేలా చూస్తారు. అయితే స్తంభాలకు లైట్లు వేసే క్రమంలో వారు భద్రత ప్రమాణాలను పాటించక ప్రాణాల మీదకు తెచ్చుకునే పరిస్థితిని ఉంది. మునిసిపల్ ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన సిబ్బంది స్తంభాలు ఎక్కి మరమ్మతులు చేస్తూ లైట్లను నిత్యం వెలిగేలా చేస్తున్నారు. తాండూరు మున్సిపాలిటీలోని 36వార్డుల్లో మునిసిపల్ ఎలక్ట్రీషియన్లు సిబ్బంది ఎలాంటి రక్షణ వస్తువులైన బెల్టు గానీ, హెల్మెట్ గానీ ధరలించకుండానే విద్యుత్ పనులు చేస్తున్నారు. గతంలో హైదరాబాద్ రోడ్డులో ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి రక్షణ వస్త్రాలు ధరించక విద్యుత్ షాక్ కొట్టి చనిపోయాడు. తగిన రక్షణ పరికరాలు లేకుండానే పనులు విద్యుత్ పనులు చేస్తే ప్రాణాలకు ప్రమాదమే. కార్మికులకు సేఫ్టీ పరికరాల పేరిట రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా పరికరాలు మాత్రం కార్మికులకు ఇవ్వడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తాండూరు మున్సిపాలిటీలో రక్షణ పరికరాలు పెట్టుకోకుండానే కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి ఎలాంటి బీమా కూడా లేదు. ఈ విషయమై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

## సార్.. దుర్వాసన వస్తోంది.. పరిష్కరించండి

తాండూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): పాఠశాల పక్కన ఉన్న హోటల్ నుంచి దుర్వాసన వస్తోందని, చర్యలు తీసుకొని హోటల్‌ను తొలగించాలని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ఉపాధ్యాయులు మున్సిపల్ అధికారులను కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ నరేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. హోటల్‌లో రోజంతా వంట చేస్తున్న సమయంలో వచ్చే వాసనతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



అధికారికి ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయులు

## జాతీయ కాన్ఫరెన్స్‌కు మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్



లావణ్యదేవేందర్‌యాదవ్



డోలి రవీందర్

కొత్తూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సీఅండ్‌డీ ఎంఎ, పార్లమెంట్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 3, 4 తేదీల్లో హర్యాణలోని గురుగ్రామ్‌లో నిర్వహించే జాతీయ కాన్ఫరెన్స్‌కు కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్, వైస్ చైర్‌పర్సన్ డోలి రవీందర్ తరలివెళ్లారు. తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఆహ్వానం మేరకు వారు కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు వెళ్లారు. జీహెచ్ఎంసీ, జీవీఎంసీ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు, రాష్ట్రంలోని ఆయా మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఆహ్వానం అందినట్లు సమాచారం. 'ప్రజాస్వామ్యం, దేశ నిర్మాణంలో స్థానిక సంస్థల పాత్ర' అంశాలపై రెండు రోజుల కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

## ఉద్యోగ, ఉపాధ్యాయులకు నగదు రహిత ఆరోగ్య కార్డులివ్వాలి



ధారూరు బాలుర పాఠశాలలో సభ్యత్వ రసీదులు అందజేస్తున్న తపస్ నాయకులు

ధారూరు, జూలై2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు నగదు రహిత ఆరోగ్యకార్డులు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు కె.అంజిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో నాయకులు సభ్యత్వ అభియాన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలపై ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం నాయకులు ఉపాధ్యాయులకు సంఘం సభ్యత్వాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమాల్‌రెడ్డి, మండల శాఖ బాధ్యులు రాజు, బాలరాజ్, విజయ్, రాజకుమార్, సంతోస్ కుమార్, అంజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గిరిజన హక్కుల సాధన కోసమే ఎల్‌హెచ్‌పీఎస్



కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకుంటున్న నాయకులు

పరిగి, జూలై 2(ఆంధ్రజ్యోతి): మా తండాల్లో.. మా రాజ్యం సాధన కోసం లంబాడా హక్కుల సాధన సమితి ఆవిర్భవించిందని సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ అన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ 28వ ఆవిర్భావ వేడుకలను బుధవారం పరిగి పాలకేంద్రంలో కేక్ కట్ చేసి జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ... ఎల్‌హెచ్‌పీఎస్ పోరాట ఫలితంగానే ప్రభుత్వం తండాలను పంచాయితీలుగా ఏర్పాటు చేసిందని తెలిపారు. గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్‌లు కూడా సాధించుకున్నామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న గిరిజనుల హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యనాయక్, కార్యదర్శి కె.రవీందర్, బాలకృష్ణ, ఎరన్‌పల్లి శ్రీనివాస్, సత్తయ్య, రఘురామ్, రాములు, వెంకట్ పాల్గొన్నారు.

## కిచెన్‌షెడ్ నిర్మించాలని వినతి

బషీరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): కిచెన్‌షెడ్ అధ్వానంగా ఉండటంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారని రెడ్డి ఘణాపూర్ జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు రవికాంత్ బుధవారం ఎంపీడీవో విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఏళ్ల తరబడి పాత గదిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు భోజనం వండిపెడుతున్నారు. గది శిథిలావస్థకు చేరి పైకప్పు ఉరుస్తోందని, ఇక్కడ 120 మంది విద్యార్థులకు భోజనం వండి పెడుతున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే కిచెన్ షెడ్ మంజూరు చేయాలని కోరారు. ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఎంపీడీవో చెప్పారు.



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న రవికాంత్

## నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

బషీరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నింబంధనల మేరకే లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేలా పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని బషీరాబాద్ ఎంపీడీవో విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ ఏఈ షేక్ హుస్సేన్ అన్సారి ఇళ్ల నిర్మాణ కొలతలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీవో జయకర్ పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సురేష్‌మోహన్

మహేశ్వరం, జూలై 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలను చైతన్య పర్చడంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ అన్నారు. బుధవారం మండలంలోని మొహబ్బత్‌నగర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పరిసరాల పరిశుభ్రతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పైప్‌లైన్ల లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు చెక్ చేస్తూ ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లను నిర్దేశిత సమయంలోపు పూర్తిచేసుకునేలా, నిబంధనల మేరకు కట్టుకునేలా లబ్ధిదారులకు సూచించాలన్నారు. కర్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలి

చేవెళ్ల, జులై 2(ఆంధ్రజ్యోతి): హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో శుక్రవారం జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, పీసీసీ వైస్ ప్రెసిడెంట్ బొంతు రామ్మోహన్ అన్నారు. చేవెళ్లలోని ఓ కన్వెన్షన్ హాలులో బుధవారం ఆయన నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యలతో కలిసి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఎల్బీ స్టేడియంలో జులై 4న బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొంతు రామ్మోహన్

## గ్రామ దేవతలకు పూజలు



పెద్దమ్మ తల్లికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

మర్పల్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా వర్షాలు లేక రైతులు, ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో రెండు రోజులుగా కురుస్తున్న వానలతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మర్పల్లిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రజలు జలాభిషేకం నిర్వహించారు. ఈ వర్షాలు పంటలకు జీవం పోశాయని సంతోషాన్ని వ్యక్తం చేశారు. అమ్మ వారికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ముున్ముందు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగుండాలని తల్లిని వేడుకున్నారు.

## పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించాలి



తరగతి గదిలో వాన నీటి వద్ద టీచర్లు, విద్యార్థులు

మోమిన్‌పేట్, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరంపల్లి ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. తేలిక పాటి వర్షాలకే తరగతి గదుల్లో వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు, టీచర్లు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ బుధవారం పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. పాత బడిన ఈ పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించాలని అధికారులను కోరారు.

### ప్రైవేట్ పాఠశాలలో పుస్తకాలను
## పట్టుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



పాఠశాలలో విక్రయిస్తున్న పుస్తకాలతో ఎస్ఎఫ్ఐ నాయకులు

యాచారం, జూలై 2(ఆంధ్రజ్యోతి): యాచారంలోని పుడమి పాఠశాల యాజమాన్యం పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులను విక్రయించడం నిబంధనలకు విరుద్ధం అని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి విప్లవ్‌కుమార్ అన్నారు. బుధవారం పాఠశాలలో అమ్ముతున్న పుస్తకాలను పట్టుకున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారన్నారు. ఈ విషయంలో అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వరుణ్, రోహిత్, అజయ్. భరత్ ఉన్నారు. ఈ విషయమై ఎంఈవో పాండురంగారెడ్డిని స్పందన కోరగా ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేటుకు పుస్తకాలు, విక్రయిస్తే తాము చర్యలు తీసుకుంటామన్నారు. అయితే స్కూలులో ఎమ్మార్పీకే విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

## సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



నజ్దిక్‌సింగారంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ కేపీవీ రాజు

యాచారం, జూలై 2(ఆంధ్రజ్యోతి):నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని, ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు చెప్పారు. బుధవారం నజ్దిక్‌సింగారంలో సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి వాడలో సీసీ కెమెరాలు ఏర్పాటుకు యువత ముందుకురావాలన్నారు. ఇటీవల చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితులను సీసీ కెమెరాల్లోని ఫుటేజీల ద్వారానే పట్టుకున్నట్లు తెలిపారు. ఆలయం వద్ద సీసీ కెమెరా ఉండి ఉంటే నేడు దొంగలు పట్టుబడే వారన్నారు. కార్యక్రమంలో యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై మధు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శ్రీశైలం, పాండురంగారెడ్డి, వి.రవీందర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హనుమాన్ విగ్రహం ధ్వంసం

- నిందితులను శిక్షించాలని హిందూ సంఘాల రాస్తారోకో



ధ్వంసమైన దేవుడి శిలా విగ్రహం

వికారాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి దుండగులు హనుమాన్ ఆలయంలో విగ్రహాన్ని ధ్వసంచేసిన ఘటన వికారాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ సమీప ఐటీఐ కాలేజీ ఆవరణలో ఉన్న హనుమాన్ ఆలయంలో మంగళవారం రాత్రి హనుమంతుడి శిలా విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బుధవారం ఉదయం హిందూ సంఘాల నాయకులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పోలీసులకు సమాచారమిచ్చి కళాశాలలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. విగ్రహంపై దాడిని ఖండిస్తూ సంఘాల నాయకులు రోడ్డుపై బైఠాయించారు. నిందితులను పట్టుకోకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కొందరు కావాలనే విగ్రహాన్ని ధ్వంసం చేశారని, హిందువుల మనోభావాలను దెబ్బతీసి మత చిచ్చుపెట్టేందుకు కుట్ర పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయంలోని విగ్రహాన్ని ధ్వంసం చేయడం ఏమాత్రం క్షమార్హం కాదన్నారు. ఆలయానికి వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ భీమ్‌కుమార్‌లు చేరుకొని వివరాలు సేకరించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఆందోళనకారులకు వారు హామీ ఇచ్చారు.



ఆలయంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు →

# భరోసా లేని బతుకులు

**ఫ్యాక్టరీల్లో తరచూ ప్రమాదాలు.. తనువు చాలిస్తున్న కార్మికులు**



నందిగామలోని అలైన్ పరిశ్రమ అగ్నిప్రమాదం (ఫైల్)

- పాశమైలారం, మేడ్చల్ పారిశ్రామికవాడ ఘటనలతో ఉలిక్కిపడిన శ్రామికులు
- కర్మాగారాల్లో భద్రతాప్రమాణాలు పాటించని యాజమాన్యాలు
- కార్మికుల రక్షణపై పట్టించుకోని లేబర్ అధికారులు
- పదేళ్లలో షాద్‌నగర్ ప్రాంత ఫ్యాక్టరీల్లో 74 మంది కార్మికుల మృతి
- పరిగి ప్రాంత పరిశ్రమల్లో 30మందికిపైగా మృత్యువాత

షాద్‌నగర్/పరిగి, జూలై2(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమ ప్రమాదంలో పదుల సంఖ్యలో కార్మికులు మృతిచెందడం, మేడ్చల్ జిల్లా పారిశ్రామికవాడలో బాయిలర్ పేలిన ఘటనలతో కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ బతుకులకు భరోసా లేదంటున్నారు. పరిశ్రమల్లో భద్రతాప్రమాణాలు పాటించడం లేదని వాపోతున్నారు. ఉపాధి కోసం వలసొచ్చి పనిచేస్తోంటే పరిశ్రమల్లో చోటుచేసుకుంటున్న ప్రమాదాలతో తమ బతుకులు చితికి, కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నియోజకవర్గంలో 300 పరిశ్రమలు

షాద్‌నగర్ నియోజకవర్గ పరిధి ఫరూఖ్‌నగర్, కొత్తూరు, నందిగామ, కొందుర్గు, కేశంపేట మండలాల్లో 300పైగా పరిశ్రమలున్నాయి. వాటిల్లో 35వేల మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారు. బతుకు వేటలో ప్రమాదకరంగా పనిచేస్తున్నామని కార్మికులు చెబుతున్నారు. భద్రతా ప్రమాణాలు పాటించడంలో గానీ, కార్మికులకు సేఫ్టీ పరికరాలు అందించడంలో గానీ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు హల్‌చల్ చేసే అధికారులు ఆ తర్వాత పరిశ్రమల్లో రెగ్యులర్‌గా తనిఖీలు చేయరు. కార్మికుల రక్షణపై వారు ఏమాత్రం పట్టించుకోరనే ఆరోపణలున్నాయి. కాలం తీరిన మిషన్ల మధ్య కార్మికులు పనిచేస్తున్నారు. స్టీల్ పరిశ్రమల కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. వాటిల్లో వందల డిగ్రీల ఉష్ణోగ్రతలతో ఉండే బాయిలర్లు, రియాక్టర్లు ఉంటాయి. వీటిని తరచూ పరీక్షించి వాటిల్లో వాడుతున్న రసాయనాలు సరైన మోతాదులో ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని పరిశ్రమల ఇన్స్‌పెక్టర్లు తనిఖీ చేయాలి. నిబంధనల ప్రకారం లేని మిషనరీలను యాజమాన్యంతో వెంటనే మార్పించే బాధ్యత అధికారులదే. అయితే కార్మిక శాఖ అధికారులు వీటి గురించి పెద్దగా పట్టించుకోకపోడం లేదు. అందుకే పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని కార్మికులు చెబుతున్నారు.

### పదేళ్లలో 74 మంది కార్మికుల మృతి

షాద్‌నగర్ నియోజకవర్గంలో గత పదేళ్లలో 74మంది కార్మికులు మృతి చెందారు. అయినా ఫ్యాక్టరీల్లో కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. పరిశ్రమల్లో మంటలార్పే సిలిండర్లు సైతం కాలం తీరినవే ఉంటాయని కార్మికులు చెబుతున్నారు. ఈ అంశంలో అగ్నిమాపక శాఖ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. వివిధ ఫ్యాక్టరీల ప్రమాదాల్లో 2014లో 9 మంది, 2015లో 11, 2016లో 10, 2017లో 12, 2018లో 9, 2019లో ఇద్దరు, 2020లో 8, 2001లో ఇద్దరు, 2022లో నలుగురు, 2023లో నలుగురు, 2024లో 8మంది చొప్పున కార్మికులు మృతిచెందారు. వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా వాటి నివారణకు అధికారులు చర్యలు తీసచుకోవండం లేదు.

### కానరాని 1979 కార్మిక చట్టం

పరిశ్రమల్లో ఎక్కడా కార్మిక చట్టం అమలు కావడం లేదు. కార్మికులు పరిశ్రమల్లో ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి పరిహారం చెల్లింపుతో పాటు ఉపాధి కల్పించాలని చట్టం సూచిస్తుంది. కానీ పరిశ్రమల్లో ఎప్పుడైనా కార్మికులు మరణిస్తే విషయం బయటకుపొక్కకుండా వారి కుటుంబ సభ్యులకు ఎంతో కొంత డబ్బు చెల్లించి రాత్రికిరాత్రే మృతదేహాలను వారి సొంత ప్రాంతానికి తరలిస్తున్నారు. బాధితులు కేసు సైతం పెట్టకుండా యాజమాన్యాలు మేనేజ్ చేస్తున్నాయి. ఇలాంటి సంఘటనలపై తరచూ పత్రికల్లో, వార్తా చానళ్లలో ప్రచురితమైతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

### చట్టాల అమలుతోనే రక్షణ

కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేస్తేనే పరిశ్రమల్లో ప్రమాదాలను, కార్మికుల మరణాలను అరికట్టొచ్చు. అది అధికారుల చర్యలతోనే సాధ్యం. కార్మికులకు యాజమాన్యాలు భద్రతా పరికరాలు అందజేయాలి. స్కిల్డ్ వర్కర్ పనిచేయాల్సిన చోట అన్‌స్కిల్డ్ లేబర్ పనిచేసినా ప్రమాదాలు చోటుచేసుకునే ఆస్కారం ఉంది. పరిశ్రమల శాఖ ఇన్‌స్పెక్టర్లు, అగ్నిమాపక శాఖ అధికారులు తరచూ ఫ్యాక్టరీలను తనిఖీ చేయాలి.

\- పి.ప్రభాకర్,
కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్

### స్టీల్, ప్లైవుడ్ పరిశ్రమల్లో
## పలు ఘటనలు

పరిగి సబ్ డివిజన్ పరిధిలోని పలు పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ ప్రాంతంలో స్టీల్, ప్లైవుడ్, కాటన్, విండ్ పవర్, బాయిల్డ్ రైస్ ఫ్యాక్టరీలు, మిల్లుల్లో వివిధ రాష్ట్రాల కార్మికులు పనిచేస్తున్నారు. పూడూరు మండలం సోమన్‌గుర్తి, పరిగి మండలం చిట్యాల్, లక్ష్మీదేవిపల్లి, మిర్దిర్లలో ఇనుప పరిశ్రమలు, రాకంచర్లలో ఇతర పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ బిహార్, ఒడిషా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల వారే ఎక్కువ మంది పనిచేస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి, చిట్యాల్, సోమన్‌గుర్తి పరిశ్రమల్లో ఇప్పటి వరకు చోటుచేసుకున్న ప్రమాదాల్లో పదుల సంఖ్యలు కార్మికులు మృత్యువాతపడ్డారు. గత పదేళ్ల కాలంలో ఫ్యాక్టరీల్లో సంభవించిన ప్రమాదాల్లో 30మందికిపైగా చనిపోయారు. ఐరన్ పరిశ్రమల్లో ఎగిసిపడే మంటలతో అగ్ని ప్రమాదాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఫైర్ యాక్సిడెంట్లలో కార్మికులు మృత్యువాత పడ్డారు. కాటన్ మిల్లులు, రైస్ మిల్లులు, విండ్ పవర్ పనుల్లోనూ ప్రమాదాలు జరిగాయి. పొట్టకూటి కోసం వేరే ప్రాంతాల నుంచి వచ్చే వారే ఎక్కువ మంది ఉన్నారు. ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్న వారి కుటుంబాలకు ఎంతో కొంత డబ్బిచ్చి కేసులు మాఫీ చేయించుకుంటున్నారు. ఫ్యాక్టరీల్లో రక్షణ అంశాలపై మాత్రం యాజమాన్యాలు దృష్టిపెట్టటడం లేదు. కార్మిక శాఖ అధికారులు పట్టించుకోకపోవడం సైతం ప్రమాదాలకు మరో కారణం అని కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పరిగి ప్రాంతంలోని ఓ పరిశ్రమ

# ముసురుకున్న వాన..!

(ఐదో పేజీ తరువాయి)

నిలిచిన నీరు చిన్నపాటి చెరువును తలపిస్తోంది. గడిచిన 24 గంటల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లిలో అత్యధికంగా 57.3 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. కందుకూరు మండలం రాచులూరులో 56.8 మిల్లీమీటర్లు, దండుమైలారంలో 52.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బాలాపూర్ ఎయిర్‌పోర్టులో 47.0 మిల్లీమీటర్లు, శంషాబాద్ మండలం పెద్ద షాపూర్‌లో అత్యధికంగా 48.0మిల్లీమీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తాటివనం ప్రాంతాలలో 47.0 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలో 36.5 మిల్లీమీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ గ్రామ పంచాయతీలో 36.3 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. శేరిలింగంపల్లి మండలం కాకతీయ హిల్స్‌లో అత్యధికంగా 34.5 మిల్లీమీటర్లు, రాజేంద్రనగర్‌లో 26.5 మిల్లీమీటర్లు, అత్తాపూర్, గండిపేటలో 22.8 మిల్లీమీటర్లు నమోదైంది. రాయదుర్గ ప్రాంతంలో 24.5 మిల్లీమీటర్లు, మొయినాబాద్‌లో 22.5 మిల్లీమీటర్లు, మొయినాబాద్ మండలం చిల్కూరు మృగవణి ప్రాంతాలలో 27.8 మిల్లీమీటర్లు, చేవెళ్లలో 17.3 వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 39.8 మిల్లీమీటర్లు, ధారూరులో 38.5 మిల్లీమీటర్లు, కోట్‌పల్లిలో 38.3 మిల్లీమీటర్లు, వికారాబాద్‌లో 37.0 మిల్లీమీటర్లు, పరిగిలో 34.0 మిల్లీమీటర్లు, పూడూరులో 30.0 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో పరిధిలోని బండ్లగూడలో 37.0మిల్లీమీటర్లు, రామంతాపూర్‌లో 27.0 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.



ఫత్తేపురం రైల్వే బ్రిడ్జి కింద చెరువును తలపిస్తున్న వరదనీరు

### యాచారం మండలంలో..

యాచారం మండలంలో మంగళవారం రాత్రి జోరుగా వాన కురిసింది. నజ్దిక్‌సింగారంలో రహదారిపై, నందివనపర్తి-మేడిపల్లి గ్రామాల మధ్య వరద నీరు నిలిచి జనం తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. యాచారం మండల కేంద్రంలోని సొసైటీ సమీపంలో, చిన్నతూండ్లలో బీసీ వాడలో, మాల్‌లోని దాబాల వద్ద, యాచారంలోని నందివనపర్తి వెళ్లేదారిలో వరద నీరు పారి వాహనాదారులు అవస్థపడ్డారు. కొత్తపల్లిలో వరద నీరు ఇండ్లలోకి చేరింది. కాగా బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు కురిశాయి. ప్రస్తుత వర్షాలకు మండలంలోని పలు గ్రామాలలో రైతులు పత్తి, జొన్న విత్తనాలు విత్తారు.

### బ్రిడ్జి కింద నిలిచిన వరదనీరు

శంకర్‌పల్లి, జులై 2(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో మంగళవారం కురిసిన వర్షానికి ఫత్తేపురం రైల్వే బ్రిడ్జి కింద భారీగా వరదనీరు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోకాళ్ల లోతు నీరు ఉండటంతో ద్విచ్రక వాహనదారులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కాగా భారీ వాహనాలు వెళ్లేందుకని గతంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు బ్రిడ్జి కింద రోడ్డును తవ్వి తిరిగి రోడ్డు వేశారు. అయితే అప్పటి నుంచి చిన్నపాటి వర్షానికే వరదనీరు అక్కడ చేరి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. వేసవిలోనే బ్రిడ్జి కింద నుంచి తీగలవాగు వరకు వరదనీరు వెళ్లేందుకని ఓపెన్ డ్రైనేజీని నిర్మిస్తామన్న అధికారులు ఆ విషయాన్ని మరిచి పోయారు.

# ఆశల సాగు!

(ఐదో పేజీ తరువాయి)

లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో వర్షాలు తక్కువగా కురవడంతో ఆయా పంటల సాగు కూడా అంతంత మాత్రంగానే ఉంది. రంగారెడ్డిజిల్లాలో జూన్‌నెలాఖరు నాటికి రైతులు 28శాతం మాత్రమే రైతులు పంటలు సాగు చేశారు. వికారాబాద్ జిల్లాలో 26 శాతం, మేడ్చల్ జిల్లాలో కేవలం 8శాతం మాత్రమే పంటలు సాగు జరిగింది.

### అత్యధికంగా 10 రోజులే..

రంగారెడ్డిజిల్లాలో జూన్‌లో అత్యధికంగా ఆమనగల్ మండలంలో 10 రోజుల పాటు వర్షాలు కురిశాయి. మిగతా మండలాల్లో ఎక్కడా పది రోజులకు మించి వర్షాలు పడలేదు. కేశంపేట, షాద్‌నగర్‌లలో 9 రోజుల పాటు, మహేశ్వరం, కడ్తాల్, మాడ్గుల, యాచారం మండలాల్లో 8 రోజుల పాటు వర్షాలు పడ్డాయి. శేరిలింగంపల్లి, గండిపేట, హయత్‌నగర్ మండలాల్లో అతి తక్కువగా రెండు రోజుల పాటు వర్షాలు కురిశాయి.

### ఈనెల ఆరంభంలో ...

జూన్‌లో రుతుపవనాలు నిరాశపరిచినప్పటికీ జూలై ఆశాజనకంగానే కనిపిస్తోంది. రైతులు ఆశలు పెట్టుకున్న విధంగానే ఈ నెల ఆరంభంలో వర్షాలు పడుతున్నాయి. సోమ, మంగళవారం నాడు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల విస్తారంగా వర్షాలు కురిశాయి. రెండు రోజుల పాటు సగటు 20 మి.మీకు పైగా వర్షపాతం నమోదైంది. అన్ని మండలాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వానాకాలం సీజన్ ఆరంభంలో పడిన వర్షాలకు విత్తనాలు వేసుకున్న రైతులు.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సంతోషపడుతున్నారు. ఇంకా రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ వెల్లడించింది. వర్షాలు కొనసాగితే వ్యవసాయ పనులు మరింత ముమ్మరమయ్యే అవకాశం ఉంది.

## రాజ్యాంగ విలువల పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బిక్యానాయక్

కడ్తాల్, జూలై 2(ఆంధ్రజ్యోతి):సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్ అన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలు కాలరాస్తోందన్నారు. జైబాపు.. జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల సమ్మేళనంపై బుధవారం కడ్తాలలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమ్మేళనానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం వారు విలేకరుతో మాట్లాడుతూ.. సమ్మేళనానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే హాజరవుతారని, 15వేల మంది గ్రామ కమిటీ అధ్యక్షులతో నిర్వహించే సమావేశంలో పార్టీ అన్ని మండలాలు, గ్రామాల అధ్యక్షులు పాల్గొని అధ్యక్షుడి సందేశాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజారంజక పాలన సాగుతోందన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని జీర్ణించుకోలేని విపక్షాలు ఉనికి కోసమే ప్రభుత్వంపై విషప్రచారానికి పాల్పడుతున్నాయని మండిపడ్డారు. సమావేశంలో ప్యాక్స్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, జహాంగిర్‌బాబ, రామకృష్ణ, జహాంగిర్ అలీ, రాజేందర్, యాదయ్యగౌడ్, జగన్, శంకర్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

## పోస్టాఫీసు డబ్బు పోస్టుమాస్టర్ ఇంట్లో!

- అధికారుల తనిఖీల్లో వెలుగులోకి
- రూ.19లక్షలు నేడు జమచేయాలని ఆదేశం



విచారిస్తున్న అధికారి భూమన్న

షాద్‌నగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులో ఉండాల్సి ప్రభుత్వ డబ్బు పోస్టుమాస్టర్ తన ఇంట్లో దాచుకున్న వైనం అధికారుల తనిఖీల్లో వెలుగు చూసింది. ఉద్యోగి ఇంట్లో దాచుకున్న రూ.19లక్షల డబ్బును నేటి (గురువారం)ఉదయంకల్లా పోస్టాఫీసులో జమ చేయకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు పోస్టుమాస్టర్‌ను హెచ్చరించారు. వివరాల్లోకి వెళ్లితే.. పోస్టాఫీసుల తనిఖీల్లో భాగంగా వనపర్తి పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ భూమన్న నేతృత్వంలో సిబ్బంది బుధవారం షాద్‌నగర్ పోస్టాఫీస్‌ను తనిఖీ చేశారు. పోస్టాఫీస్ ఆర్థిక వ్యవహారాల లెక్క చూడగా రూ.19లక్షలు పోస్టాఫీసులో లేనట్టు గుర్తించారు. పోస్టాఫీస్ డబ్బును పోస్టుమాస్టర్ ఉమామహేశ్వర్ తన ఇంట్లో దాచినట్టు గుర్తించిన అధికారి అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టాఫీసులో లాకర్ లేకుంటే భద్రత కోసం పోలీస్‌స్టేషన్‌లో దాచాల్సి ఉంది. కానీ పోస్ట్‌మాస్టర్ ప్రభుత్వ డబ్బును ఇంట్లో పెట్టుకోవడంపై అధికారి ఆగ్రహించారు. ఇదిలా ఉంటే తనిఖీ అధికారులు డబ్బును వెంటనే పోస్టాఫీసుకు తెప్పించకుండా ఒక రోజు గడువు ఎందుకు ఇచ్చారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రోజూ పోస్టాఫీసులో 10లక్షల వరకు జమవుతున్నట్లు అధికారులు తెల్పారు. పోస్టుమాస్టర్ తనింట్లో ఎంత డబ్బు దాచాడనే విషయం మరింత స్పష్టంగా తెలియాల్సి ఉంది.

### దొంగచాటుగా
## మద్యం విక్రయాలు

- బండవెల్కిచర్ల వాసుల ఆగ్రహం

కులకచర్ల, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్లలో మద్యం అమ్మకాలను బంద్ చేయాలని గ్రామస్తులు తీర్మానించినా కొందరు దొంగచాటుగా అమ్ముతున్నారని మహిళలు, యువకులు బుధవారం వారిపై దాడికి యత్నించారు. గ్రామంలో మద్యం అమ్మొద్దని మంగళవారం బెల్టు దుకాణాలు, కిరాణాషాపుల యజమానులకు యువకులు, మహిళలు నోటీసులిచ్చారు. గ్రామ యువకులు మద్యానికి బానిసవుతున్నారని, కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయనే ఆవేదనతో తాము గ్రామంలో మద్యం అమ్మొద్దని తీర్మానిస్తే కొందరు దుకాణదారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. దొంగచాటుగా మద్యం విక్రయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో మద్యపాన నిషేధంపై ర్యాలీ నిర్వహించారు. ఇకపై గ్రామంలో మద్యం అమ్మితే అధికారులకే నేరుగా తెలియజేస్తామని హెచ్చరించారు.

### వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పరిగి, జూలై 2(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం పరిగి మండలం రంగంపల్లి శివారులో బుధవారం రాత్రి జరిగింది. మండల పరిధిలోని బాబాపూర్ గ్రామానికి చెందిన అస్లాం(44) బుధవారం రాత్రి బైక్‌పై రంగంపల్లి వైపు నుంచి పరిగికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అస్లాం అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పరిగి ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పరిగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పించండి

కేశంపేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని బుధవారం కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రులు రాఘవేందర్, రాజేందర్‌లు వినతిపత్రం సమర్పించారు. పాఠశాలలో మూత్రశాలలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. తాగునీటివసతి లేదని, వంటగది కూడా సక్రమంగా లేదని, మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు ఆహారం తినడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతిపత్రంలో కోరారు.

## పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

యాచారం, జూలై 2(ఆంధ్రజ్యోతి): నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని యాచారం మండలంలోని తక్కళ్లపల్లి మాజీ ఉపసర్పంచ్ పగడాల శ్రీశైలం బుధవారం ఎంపీడీవో రాధారాణికి వినతిపత్రం అందజేశారు. గ్రామం లో 80మంది నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేస్తామని గతంలో అధికారులు, పాలకులు ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరారు.

## మతసామరస్యానికి ప్రతీక మొహర్రం

షాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రంను ఉత్సాహంగా జరుపుకోవాలని సర్దార్‌నగర్ మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింహులు అన్నారు. మొహర్రంను పురస్కరించుకొని బుధవారం రూ.5వేల చెక్కును గ్రామస్తులకు అందించారు. గ్రామస్తులు అశోక్‌కుమార్, యాదయ్య, కలాం, రాకేష్, హాజి, సురేష్, యాదయ్య, నరేష్‌లు ఉన్నారు.

## నేడు సమీక్ష సమావేశం

ఆమనగల్లు, జూలై 2(ఆంధ్రజ్యోతి): వివిధ పథకాల అమలుపై ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో నేడు(గురువారం) ఉదయం 11 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు. జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి ఆదేశానుసారం స్పెషలాఫీసర్ శోభారాణి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, హౌజింగ్ శాఖ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆమె కోరారు. సమావేశంలో వివిధ పథకాలపై సమీక్ష ఉంటుందని మాధురి తెలిపారు.

## అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

శంషాబాద్ రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ఫిరంగి నాలా పరిసర ప్రాంతాల్లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మిషన్ కాంపౌండ్, అయ్యప్ప కాలనీవాసులు బుధవారం సీఎంవోలో అధికారులకు ఫిర్యాదు చేశారు. కాలనీలో ఆనుకొని ఉన్న ఫిరంగినాలా కలుషితమైన నీటితో ఉందన్నారు. మరో వైపు అదే ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ నాలాలో మున్సిపల్ సిబ్బంది తాగునీటితో పాటు డ్రైనేజీ కనెక్షన్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కాలనీవాసులకు తలనొప్పి, వికారం, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. నాలాలో చేరిన నీరు బయటకు వెళ్లకపోవడంతో దోమలు, ఈగలకు ఆవాసంగా మారిందన్నారు. సురేషిణి కురుత్, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశిబిరం విజయవంతం

చౌదరిగూడ, జూలై 2(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల పరిధిలోని చిన్న ఎమ్మెంత్యాలలో ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. బుధవారం చెవేళ్ల పట్నం మహేందర్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు రాయికంటి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, అనంద్, డాక్టర్లు పాల్గొన్నారు.

## కేపీఎన్‌పీఎస్ మహాసభలను విజయవంతం చేయాలి

కేశంపేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి(కేఏఎన్‌పీఎస్) రాష్ట్ర మహా విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ ఎర్ర మోహనకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఆవరణలో బుధవారం రాష్ట్ర మహాసభకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ నెల 13న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే 2వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరారు. నారాయణపేట జిల్లా కన్వీనర్ లక్ష్మయ్య, సభ్యులు జంగయ్య, తోట లక్ష్మయ్య, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

కొత్తూర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచి, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియ్ జిల్లా అధ్యక్షుడు రామావత్ సక్రునాయక్ అన్నారు. మున్సిపల్ కార్మికులతో కలిసి కమిషనర్ బాలాజీకి బుధవారం వినతిపత్రమిచ్చారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనం ఇవ్వాలన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. దేవమ్మ, అంజమ్మ, మంజుల, సుజాత, రాములు, ప్రసాద్, రాము, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో చోరీలు.. కటకటాలపాలు

- ఆలయాల్లో వరుస దొంగతనాలకు పథకం
- ఇద్దరు నేరగాళ్ల అరెస్టు.. సొత్తు కొన్న వ్యక్తి కూడా..
- రూ.56,36,300 విలువైన విగ్రహాలు, ఆభరణాలు సీజ్
- డబ్బు సులువుగా సంపాదించాలనే ఆశతో చోరీలు.. చివరకు పోలీసులకు చిక్కి జైలుకు..


వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

కొత్తపేట/ఇబ్రహీంపట్నం, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో చోరీలు చేస్తున్న ఇద్దరు నేరస్తులను, కొనుగోలు చేసే వ్యక్తినీ ఎల్‌బీనగర్ సీసీఎస్, ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.56,36,300 విలువైన పంచలోహ దేవతామూర్తుల విగ్రహాలు, బంగారు, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఎల్బీనగర్ క్యాంపులో వివరాలు వెల్లడించారు.

### సులభంగా డబ్బు సంపాదించాలని..

మద్యానికి బానిసలై సులభంగా డబ్బు సంపాదించాలని ఇద్దరు కూలీలు నేరాల బాట పట్టారు. ఏపీలోని కర్నూల్‌కు చెందిన కరచ శివానంద(52) వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలో, ప్రకాశం జిల్లా వల్లపల్లికి చెందిన షేక్ హంషరీఫ్(36) ఎల్బీ నగర్‌లో ఉంటున్నారు. కూలీ అడ్డాలలో ఇద్దరూ కలిసేవారు. సమయం దొరికినప్పుడు కలిసి మద్యం సేవించేవారు. ఈక్రమంలో సులభంగా డబ్బు సంపాదించడానికి నిర్ణయించుకున్నారు. దాంతో నేరాలు చేయాలని అనుకున్నారు. ప్రధాన నిందితుడు శివానంద ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలు చోరీ చేసి విక్రయిస్తే పెద్దమొత్తంలో డబ్బు సంపాదించవచ్చని పథకం వేశాడు. ఇద్దరూ అద్దె ఆటోలో తిరుగుతూ శివారు ఇబ్రహీంపట్నం, యాచారం ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. గత ఫిబ్రవరి 27న యాచారం మండలం గండ్లగూడలోని ఆలయాల్లో 4 గుడి గంటలు, జూన్ 15న ఉప్పరిగూడ మల్లన్న ఆలయంలో వంద గ్రాముల బంగారు పుస్తెలతాడు, 2 దీపపు షమ్మెలు, జూన్ 24న ఉప్పల్ మెట్రో క్యాష్ అండ్ క్యారీ వద్ద పార్కు చేసి ఉన్న బైకును చోరీ చేశారు. తర్వాత 29న అబ్దుల్లాపూర్‌మెట్ సద్దుపల్లి తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో దేవతామూర్తుల పంచలోహ, వెండి విగ్రహాలు, పూజా సామాగ్రి చోరీ చేశారు. జూన్ 30వ తేదీన ఇబ్రహీంపట్నం పరిధిలోని ఆలయాల్లో పంచలోహ దేవతామూర్తుల విగ్రహాలు, స్వామివార్ల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. సిద్దిపేటకు చెందిన అక్కపల్లి క్రాంతికుమార్ (31) ఉప్పల్ భరత్‌నగర్‌లో ఉంటూ మండి మార్కెట్, అన్నపూర్ణ కాలనీలో శివకుమార్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో స్క్రాప్ వ్యాపారం చేస్తున్నాడు. శివానంద, షరీఫ్‌లు చోరీ చేసిన కొంత పూజా సామగ్రిని, పంచలోహ విగ్రహాలనూ క్రాంతికుమార్‌కు రూ.18,500లకు విక్రయించారు.

### మంగల్‌పల్లి గేటు వద్ద అదుపులోకి..

బుధవారం ఉదయం ఇబ్రహీంపట్నం మంగల్‌పల్లి గేటు వద్ద ఎల్బీ నగర్ సీసీఎస్ పోలీసులు, ఇబ్రహీంపట్నం పోలీసులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న శివానంద, షరీఫ్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో చోరీలు చేసిన సంగతి ఒప్పుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు సొత్తును కొనుగోలు చేసిన క్రాంతికుమార్‌నూ అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5,36,300 విలువచేసే ఆభరణాలు, విగ్రహాలు, గంటలు, పూజా సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. 2021 నుంచి ఈ జూన్ వరకు ప్రధాన నిందితుడు శివానందపై వరంగల్ కాజీపేటలో 2కేసులు, రాచకొండ పరిధి మీర్‌పేటలో 2, నాగోల్‌లో చోరీలు చేసి పోలీసుల చేతికి చిక్కి కటకటాల పాలయ్యాడు. కాగా, శివానంద, షరీఫ్‌లపై ఈ యేడాది యాచారం, అబ్దుల్లాపూర్ మెట్, ఉప్పల్‌లో ఒక్కోటి.. ఇబ్రహీంపట్నంలో 4 కేసులు న మోదయ్యాయి. విలేఖరుల సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం, ఎల్బీ నగర్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, మహేందర్‌రెడ్డి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ స్కీమ్ కింద రైతులకు కంది విత్తనాల పంపిణీ


శంకర్‌పల్లి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నదని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ స్కీమ్ కింద రైతులకు ఉచితంగా కందులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు 4కిలోల చొప్పున కందులను అందజేయడం సంతోషకరమన్నారు. రైతులకు పెట్టుబడి సహాయంగా రైతు భరోసా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం రైతుల గురించే ఆలోచించే వ్యక్తి అని, కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. మండల పంచాయతీ అధికారి గిరిరాజ్, వ్యవసాయ అధికారి చైతన్య, ఏఈవో రామకృష్ణారెడ్డి. నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, రాంరెడ్డి, పొడువు శ్రీనివాస్, పాండురంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

### కంది విత్తనాల పంపిణీ

**చౌదరిగూడ** : జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. వానాకాలం పంట సాగు కోసం ప్రభుత్వం ఉచితంగా కంది రకం పీఆర్జీ 176, సీఎస్ 41 జొన్న రకం విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, వెంకట నర్సింహారెడ్డి, ఆంజనేయులు, అజార్, నాగేందర్, ఏఈవో స్వాతి తదితరులు పాల్గొన్నారు.


చౌదరిగూడ : రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో రాజేందర్‌రెడ్డి

## విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలి : సీఐ


షాద్‌నగర్ అర్బన్ : విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): యువత సేవాభావం వైపు అడుగులు వేస్తూ, విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలని పట్టణ సీఐ విజయ్‌కుమార్ కోరారు. షాద్‌నగర్ పట్టణంలోని వెంకటేశ్వరకాలనీ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం జాతీయ మానవ హక్కుల, నేర నియంత్రణ సంస్థ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్కాకుల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగ్‌లు, పలకలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. సీఐ, ఎంఈవో మనోహర్, హెచ్ఎం శశికళ, సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌సింగ్, లీగల్ అడ్వైజర్స్ చందానజైన్, దుర్గాదేవిలు బ్యాగ్స్‌ను అందజేశారు.

### విద్యార్థులకు షూస్ పంపిణీ


మాడ్గుల, జులై 2(ఆంధ్రజ్యోతి): అవురుపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు జడ్పర్ల గ్రామానికి చెందిన దాతలు చవ్వ తేజ, లట్టుపల్లి నవీన్‌గౌడ్‌లు 120మంది విద్యార్థులకు షూస్ పంపిణీ చే శారు. పీడీ వి.ప్రసాద్ చొరవతో బుధవారం ఎంఈవో సర్దార్‌నాయక్ చేతుల మీదుగా అందచేశారు. టీచర్లు నాగార్జున, సుధాకర్, ప్రవీణ్,శ్రీధర్, అరుణ, అలివేలు, ప్రసాద్ పాల్గొన్నారు.

### మౌలిక సదుపాయాలు కల్పించాలి

**తలకొండపల్లి** : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల సంఖ్య పెంపునకు స్థానికులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని ఎంఈవో సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ శ్రీశైలం అన్నారు. దేవునిపడకల్, రావిచెడ్ ఉన్నత పాఠశాలలకు చీపునుంతలకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఎర్ర సుధాకర్‌రెడ్డి గ్రీన్ బోర్డులను సమకూర్చి అందజేశారు. మాజీ సర్పంచ్‌లు రఘుపతి, శ్రీశైలం, తదితరులున్నారు.

### వంట గది పరిశీలన

తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వంట గదిని ఎంఈవో చంప్లానాయక్ పరిశీలించారు. వంట గది రేకులు కొన్నేళ్ల క్రితం వర్షం, గాలి తాకిడికి కూలిపోయాయి. మధ్యాహ్న భోజన నిర్వాహణకు వంట నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మాజీ ఉపసర్పంచ్ పద్మ అనిల్ ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారుల దృష్టికి తీసుకుపోయారు. తలకొండపల్లికి చెందిన మాజీ ఎస్ఎంసీ ఛైర్మన్ శ్రీకాంత్ వంటగది రేకుల నిర్మాణానికి ముందుకువచ్చారు. శ్రీకాంత్‌తో కలిసి ఎంఈవో కిచెన్ షెడ్‌ను పరిశీలించి వీలైనంత త్వరగా రేకుల నిర్మాణం జరిగేలా చూస్తానన్నారు.


తలకొండపల్లి : వంట గదిని పరిశీలిస్తున్న ఎంఈవో చంప్లానాయక్

## రోడ్డు విస్తరణ జరిగేనా..?

(ఐదో పేజీ తరువాయి)

మలుపు చాలా ప్రమాదకరంగా ఉంది. అక్కడ ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు మిత్రులు పీర్లగూడ శివారులో ఉన్న తమ పొలం వద్దకు స్కూటర్‌పై వెళ్తుండగా సోలార్ ప్లాంట్ వద్ద ఉన్న మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు కిందికి వెళ్లి పోయింది. రోడ్డు పక్కన ఉన్న రాయికి తలలు తగిలి ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే కొందుర్గు మండలం ఆగిర్యాల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై షాద్‌నగర్ వస్తుండగా అదే మలుపు వద్ద ఎదురుగా వచ్చిన మరో మోటార్ సైకిల్‌ను ఢీకొట్టారు ప్రమాదంలో ఆగిర్యాలకు చెందిన ఇద్దరు యువకులు మృతి చెందగా ఎదురుగా వచ్చిన మోటార్ సైకిల్‌పై ఉన్న యువకుడు కూడా మృతి చెందాడు.

### రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు

పట్టణంలోని మాజిపల్లి రోడ్డులో పరిస్థితి దారుణంగా ఉంటుంది. పట్టణంలో హనుమాన్ దేవాలయం నుంచి హాజిపల్లి రోడ్డు మలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా మాంసం దుకాణాలు ఉన్నాయి. అసలే ఇరుకుగా ఉన్న రోడ్డును పూర్తిగా ఆక్రమించి మద్యం దుకాణాలు వెలిశాయి. వాటికితోడు కుక్కలు గుంపులు గుంపులుగా చేరి భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఆదివారమైతే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. రోడ్డు విస్తరణతోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

### డబుల్ రోడ్డు నిర్మించాలని..

షాద్‌నగర్ నుంచి డబుల్ రోడ్డు నిర్మించాల్సి ఉన్నా కిషన్‌నగర్ నుంచి అయ్యవారిపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మించారు. ఏళ్ల తరబడి వెడ ల్పు చేయాలని కిషన్‌నగర్, మాజిపల్లి గ్రామస్తులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవ డం లేదనే విమర్శలున్నాయి. ప్రమాదాల నివారణ కు రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరుతున్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం

కేశంపేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): లింగంధన గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి షాద్‌నగర్ మార్కెట్ క మిటీ మాజీ వైస్‌చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్ భారీ విరాళం అందించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు బుధవారం జడ్పర్లలోని ఆయన నివాసంలో కలిసి ఆలయ నిర్మాణానికి సహాయం అందించాలని కోరారు. ఈమేరకు ఆయన రూ.1,11,000 విరాళం వారికి అందజేశారు. రామస్వామి, ఎన్. కృష్ణయ్య, జంగయ్య, కృష్ణ, బాబు, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం : వీర్లపల్లి

కేశంపేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదల పాలిట వరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తపేటకు చెందిన గుండు చెన్నకేశవులు అనారోగ్యంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కాంగ్రెస్ కేశంపేట మండలాధ్యక్షుడు వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్పలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2.50లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. హైదరాబాద్‌లోని కార్యాలయంలో బుధవారం కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందించారు.

## మురుగు కాలువ విస్తరణకు నిధులివ్వండి


ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న భగత్‌సింగ్ కాలనీవాసులు

షాద్‌నగర్ అర్బన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని భగత్‌సింగ్ కాలనీలోని ప్రధాన మురుగు నీటి కాలువ విస్తరణ కోసం నిధులు కేటాయించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతిపత్రాన్ని ఇచ్చారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి సమస్యను వివరించారు. 22వ వార్డు పరిధిలో ఉన్న భగత్‌సింగ్ కాలనీలో పట్టణంలోని రామకృష్ణ థియేటర్, కటికఘేరి, పద్మావతికాలనీ, విజయనగర్ తదితర కాలనీల మురుగు వస్తున్నదని, వర్షాలు కురిసినప్పుడు నీరు మురుగు నీటి కాలువలో పట్టక ఇండ్లలోకి వస్తున్నాయన్నారు. యాదగిరియాదవ్, రమేష్, వెంకటేష్‌యాదవ్, మహేందర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

## యూట్యూబ్ చానల్‌పై ఫిర్యాదు

ఆమనగల్లు, జూలై 2(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిపై అసత్య కథనాలు ప్రసారం చేస్తూ ఆయన పరువుకు భంగం కల్గిస్తున్న సిగ్నల్ టీవీ తెలుగు యూట్యూబ్ చానల్‌పై చర్యలు తీసుకోవాలని ఆమనగల్లు మండల కాంగ్రెస్ నాయకులు పోలీసులను కోరారు. బుధవారం ఎస్సై వెంకటేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. యూట్యూబ్ చానెల్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలను వెంటనే తొలగించి సిగ్నల్ టీవీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ ఆమనగల్లు పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, జిల్లా నాయకుడు మండ్లీ రాములు, విజయ్, తాళ్ల రవీందర్, శ్రీశైలం, ఫరీద్, కొండల్‌రెడ్డి, కండె సాయి, నాజర్, కృష్ణ, హరిలాల్, తదితరులు ఉన్నారు.

### ఎమ్మెల్యే కసిరెడ్డిపై బీఆర్‌ఎస్ విష ప్రచారాలు

కడ్తాల్, జూలై 2(ఆంధ్రజ్యోతి): అవినీతి అక్రమాలు, నియంత పాలన, అహంకార పోకడలతో అధికారానికి దూరమైన బీఆర్‌ఎస్ నాయకులు జీర్ణించుకోలేక యూట్యూబ్ చానళ్లను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలపై విష ప్రచారాలకు ఒడిగట్టారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్ ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ యూట్యూబ్ చానళ్ల ద్వారా తప్పుడు వీడియోలను రూపొందించి పజేసి కిప్పింగ్‌లను సోషల్‌మీడియాలో పోస్టుచేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డిపై అసత్య కథనం ప్రసారం చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

## కుట్టు మిషన్లు, మెడికల్ కిట్ల పంపిణీ

ఆమనగల్లు, జూలై 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతువేదికలో బుధవారం మైనారిటీ మహిళలకు ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి పథకం కింద ఆరుగురికి కుట్టు మిషన్లు మంజూరయ్యాయి. కేఎన్‌ఆర్ సేవాదళం వ్యవస్థాపక అధ్యక్షుడు మెకానిక్ బాబా, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌ఖాద్రీ, నాయకుడు విజయ్‌లు పంపిణీ చేశారు. అలాగే కోనాపూర్‌లో గర్భిణులకు మెడికల్ కిట్లను ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ సరితపంతూనాయక్, మాజీ సర్పంచ్ కడారి మల్లమ్మయాదయ్య, కార్యదర్శి రమ్యలు పంపిణీ చేశారు.

## జాతీయ అవార్డుకు నివేదికలు సిద్ధం చేయండి

కేశంపేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): జాతీయ పంచాయతీ అవార్డుకు నివేదికలు సిద్ధం చేసుకోవాలని కేశంపేట ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య సూచించారు. అల్వాల రైతు వేదికలో బుధవారం జాతీయ పంచాయతీ అవార్డు 2023-24కు సంబంధించిన సమాచారం, నివేదికలపై అవగహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ అన్నిశాఖల నుంచి వచ్చిన నిధులు, ఖర్చులు వివరాలు సేకరించాలని సూచించారు.

## క్రైం కార్నర్

## స్వదేశానికి రవీందర్ మృతదేహం

- ఇటీవల ఇజ్రాయిల్‌లో మృతి చెందిన జగిత్యాల జిల్లావాసి

శంషాబాద్ రూరల్, జూలై2 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం జరిగిన సమయంలో ప్రాణాలు కాపాడుకోవడానికి ప్రజలు బంకర్లలో తలదాసుకున్నాడు. ఈక్రమంలో తీవ్ర అనారోగ్యానికి గురైన జగిత్యాల జిల్లాకు చెందిన రేవెల్ల రవీందర్ (57) మృతిచెందాడు. కుటుంబ సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డికి ఈ విషయం తీసుకెళ్లగా ఇజ్రాయిల్ నుంచి రవీందర్ మృతదేహం స్వదేశానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకున్నారు. బుధవారం ఉదయం 5.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని కార్గోకు రవీందర్ మృతదేహం చేరుకుంది. విమానాశ్రయంలో మృతదేహానికి జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జ్యోతిలక్ష్మణ్, ఎన్నారై అడ్వైజర్ కమిటీ వైస్‌చైర్మన్ మంద భీంరెడ్డి నివాళులర్పించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జ్యోతి మాట్లాడుతూ.. బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన అనేక మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. అలాంటి వారి కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా పథకం ఎందరికో ఉపయోగపడుతోందని చెప్పారు. ఇజ్రాయెల్, సింగపూర్ తదితర దేశాల్లో మృతిచెందిన కార్మికులకు కూడా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా పథకం వర్తింపచేయాలని ఆమె కోరారు. అనంతరం శవపేటికను అంబులెన్స్‌లో జగిత్యాలకు తరలించారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మాడ్గుల, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్కులపల్లి గ్రామ పరిధిలోని రాజీవ్‌నగర్ తండా సమీపాన గల చిన్నవాగు నుంచి కొందరు వ్యక్తులు 3 ట్రాక్టర్లలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు కొర్రరాజు, కొర్రబాలు కొర్ర శివ, కొర్ర చంద్రకళ, మారేపల్లి శ్రీనులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్న సీఐ వేణుగోపాల్ తెలిపారు.

## ఇద్దరు బాల కార్మికులకు విముక్తి

ఆదిభట్ల, జూలై 2(ఆంధ్రజ్యోతి): ముస్కాన్ టీం ఇద్దరు బాలకార్మికులకు విముక్తి కలిగించిన ఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ముస్కాన్ టీం ఎస్సై రామకృష్ణ కథనం మేరకు.. ఛత్తీస్‌ఘడ్, పశ్చిమబెంగాల్‌లకు చెందిన ఇద్దరు బాలకార్మికులను పట్టుకున్నట్లు తెలిపారు. మన్నెగూడ బాలాజీ టిఫిన్ సెంటర్‌లో ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన బాలుడు, తుర్కయంజాల్ స్నేహ అక్షయ చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన బాలకార్మికురాలికి విముక్తి కలిగించినట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు ఆదిభట్ల పోలీసులు బాలాజీ టిఫిన్ సెంటర్‌తో పాటు స్నేహ అక్షయ చికెన్ సెంటర్ల యాజమానులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


రాంచంద్రయ్య

శంషాబాద్ రూరల్, జూలై 2(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. శంషాబాద్ మండలంలోని కవ్వగూడకు చెందిన అవుసుల రాంచంద్రయ్య కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువు కోసం కవ్వగూడ గ్రామ పరిధిలోని ప్రభాకర్‌రెడ్డి తోటలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. జూన్ 30న తోటనుంచి కల్లు సేవించేందుకు కవ్వగూడకున రాంచంద్రయ్య తిరిగిరాలేదు. తెలిసినవారు, బంధువుల దగ్గర ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో బుధవారం ఆయన కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు.

## జీవాలు ఆరోగ్యంగా ఉంటేనే రైతులకు లాభం

షాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): జీవాలు ఆరోగ్యంగా ఉంటేనే రైతులకు లాభం చేకూరుతుందని.. అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని హైతాబాద్‌లో పశువులకు గొంతువాపు నివారణ టీకా లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు రోగాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక దైవదర్శన టూర్ ప్యాకేజీని వినియోగించుకోండి

ఇబ్రహీంపట్నం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నుండి స్పెషల్ దైవ దర్శన టూర్ ప్యాకేజీని భక్తులు వినియోగించుకోవాలని డిపో మేనేజర్ వెంకటనర్సప్ప కోరారు. రెండవ టూర్ ప్యాకేజీలో జోగులాంబ దేవాలయం, కానిపాకం శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయం, వేలూరు గోల్డెన్ టెంపుల్, శ్రీ అరుణాచలం దేవాలయాలను దర్శించుకోవచ్చని డీఎం తెలిపారు. ఈనెల 9న మధ్యాహ్నం ఒంటి గంటకు ఇబ్రహీంపట్నం డిపో నుంచి బస్సు బయలుదేరి 11వ తేదీన తిరిగి ఇబ్రహీంపట్నం చేరుకుంటుందని చెప్పారు. మెట్రో డీలక్స్ పెద్దలకు రూ.3,800, పిల్లలకు రూ.3,000 ఉంటుందన్నారు. అలాగే మూడవ టూర్ ప్యాకేజీలో విజయవాడ కనకదుర్గ దేవాలయం, ఉండవల్లి గుహలు, శ్రీ పానకాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని దర్శించుకోవచ్చని చెప్పారు. ఈనెల 20న ఉదయం 5గంటలకు ఇబ్రహీంపట్నం బస్టాండు నుంచి బస్సు బయలుదేరి అదేరోజు రాత్రి తిరిగి పది గంటలకు ఇబ్రహీంపట్నం చేరుకుంటుందని చెప్పారు. మెట్రో డీలక్స్ పెద్దలకు రూ.1,500, పిల్లలకు రూ.1,000 చార్జి ఉందన్నారు. బస్సు టికెట్ బుకింగ్ కోసం ఫోన్‌నెంబర్-8008822244కు ఫోన్‌పే, గూగుల్‌పే సౌకర్యం ఉందని తెలిపారు. వివరాలకు-9866336621, 8008822244 నెంబర్లను సంప్రదించవచ్చని డిపో మేనేజర్ వెంకటనర్సప్ప తెలియజేశారు.

## లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్‌గా మనోహర్‌రెడ్డి

- కార్యదర్శిగా మధన్‌మోహన్‌రెడ్డి


మనోహర్‌రెడ్డి, మధన్‌మోహన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్‌గా షాద్‌నగర్ చెందిన ఎ.మనోహర్‌రెడ్డి, కార్యదర్శిగా కొప్పుల మధన్‌మోహన్‌రెడ్డిలను నియమిస్తూ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండు సంవత్సరాల పాటు వారి అండర్‌లో ఉన్న 12 లయన్స్ క్లబ్‌ల పనితీరును పర్యవేక్షిస్తారు. క్లబ్‌ల సేవా కార్యక్రమాలను విస్తరింపజేస్తూ డిస్ట్రిక్ట్ గవర్నర్‌కు ఎప్పటికప్పుడు నివేదికలను పంపిస్తారు. అలాగే లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్లుగా షాద్‌నగర్‌కు చెందిన కమ్మదనం సందీప్, రాజు బుయ్యంగారి, నాగర్‌కర్నూల్‌కు చెందిన డి. రాధారెడ్డిలను నియమించారు.

## మాదిగలు సామాజికంగా ఎదగాలి

కొత్తూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మాదిగలు సామాజికంగా ఎదగాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. మండల కేంద్రంతో పాటు, కొడిచర్ల, ఎస్బీ పల్లి గ్రామాల్లో బుధవారం ఆయన, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహతో కలిసి పర్యటించి ఎమ్మార్పీఎస్ జెండా గద్దె నిర్మాణాలకు పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ మాదిగ సమాజానికి దక్కాల్సిన రిజర్వేషన్ హక్కుల కోసం పోరాడుతూనే, నిరాదరణకు గురైన వికలాంగులు, వృద్ధులు, వితంతవుల కోసం పోరాడి పింఛన్లు ఇప్పించడం జరిగిందన్నారు. ఎమార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు లింగం, లక్ష్మయ్య, సాయి, కిరణ్, శివశేఖర్, మోహన్, చింటు, జంగయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.


జెండా గద్దె నిర్మాణం వద్ద కొబ్బరికాయ కొడుతున్న ఉపేందర్ మాదిగ